కాంగ్రెస్‌కు మరో అస్త్రం

● బీజేపీ పాలనలో బీబీఎంపీ అక్రమాలపై నివేదిక

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష బీజేపీపై తిరగబడేందుకు మరో అస్త్రం లభించింది. 2019 నుంచి 2022 వరకు బీజేపీ పాలనలో బీబీఎంపీ పరిధిలో పలు అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాగమోహన్‌దాస్ నేతృత్వంలోని కమిటీ నివేదిక సమర్పించింది. ఏడాదిగా కమిషన్ వివిధ కోణాల్లో పరిశీలించి నివేదిక తయారు చేశారు. మూడేళ్ల వ్యవధిలో రూ.3049.35 కోట్ల అవినీతి బహిరంగమైనట్టు నివేదికలో పొందుపరిచినట్లు తెలుస్తోంది. చెత్త పర్యవేక్షణ, రోడ్ల అభివృద్ధి తదితర 761 పనుల్లో లోపాలు చూపారు. బీజేపీ ప్రభుత్వంపై గత శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 40శాతం కమీషన్ ప్రభుత్వం అంటూ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే కమిటీ వేయించారు.

పోలీస్ నియామకాలకు కసరత్తు





● ఎస్సీ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి ● ఇక ఉద్యోగాల భర్తీకి ఏర్పాట్లు
● కేఎస్ఆర్‌పీలో 2,032 కానిస్టేబుల్ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్

బెంగళూరు, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముగిసిందని ముఖ్యమంత్రి ప్రకటించారు. వర్గీకరణకు అవసరమైన కమిషన్ సిఫారసులకు అనుగుణంగానే నియామకాల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. వర్గీకరణను కేబినెట్, శాసనసభలు ఇప్పటికే అంగీకరించాయి. వర్గీకరణ పూర్తి చేయాలని భావించిన ప్రభుత్వం 2024 డిసెంబరు నుంచి వివిధశాఖల వారీగా నియామకాలకు జరిపిన ప్రక్రియకు బ్రేక్ పెట్టిన విషయం తెలిసిందే. 60వేల పోస్టులకోసం పరీక్షలకు సిద్ధమైన అభ్యర్థులు ఒక్కసారిగా షాక్ తిన్నారు. ప్రభుత్వం వర్గీకరణతో అన్ని ఉపకులాలకు న్యాయం చేశామని ప్రకటిస్తున్నా వివిధ కులాలకు చెందినవారు వర్గీకరణతో నష్టపోయామని ఆందోళన చేస్తున్నారు. ఫ్రీడంపార్కు కేంద్రంగా రోజూ నిరసనలు కొనసాగుతున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం రెండు అడుగులు ముందుకేసింది. వర్గీకరణ ప్రక్రియ పూర్తి కావడంతో నేరుగా నియామకాల ప్రక్రియను ప్రారంభించారు. కర్ణాటక స్టేట్ రిజర్వు పోలీస్ (కేఎస్ఆర్‌పీ) విభాగంలోని 2,032 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమైంది. వర్గీకరణ రిజర్వేషన్‌కు అనుగుణంగానే నియామకాలు చేపట్టినట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. స్పోర్ట్స్ కోటా 3శాతం మినహాయించి, సవరించిన రోస్టర్‌కు అనుగుణంగా పోస్టులను కేటాయించారు. నియామక ప్రక్రియలో వయసు సడలించే అంశమై పొరుగురాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించాలని నిర్ణయించారు. దీంతో కానిస్టేబుల్ పోస్టులకోసం ఎదురుచూస్తున్న ఆశావహులకు కొత్త శక్తిని ఇచ్చినట్లయ్యింది. ఎస్సీ రిజర్వేషన్ ప్రకారం సవరించబడిన రోస్టర్‌ను గుర్తించారు. తద్వారా పోలీసుశాఖలో కొన్ని విభాగాల్లో గతంలో ప్రస్తావించిన సంఖ్యాబలాలలో మార్పు కానుంది. సవరించబడిన రోస్టర్‌లో స్పోర్ట్స్ రిజర్వేషన్‌తో కలిపి గతంలో బ్యాక్‌లాగ్‌లను చేర్చి నేరుగా నియామకాలను చేపట్టాలని నిర్ణయించారు. కల్యాణ కర్ణాటకకు 532 పోస్టులను కేటాయించి మిగిలిన అన్ని జిల్లాలకు కలిపి 1500 పోస్టులతో కలిపి 2,032 పోస్టులను ప్రస్తుతం నియమించాలని నిర్ణయించారు. ఈనెల 9న నియామకపు విభాగం డిఐజీ ఎన్ఎన్ అనుచేత్, కేఎస్ఆర్‌పీ ఏడీజీపీ ఉమేశ్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా సూచనలు చేశారు. అందుకు అనుగుణంగానే సవరించబడిన పోస్టుల జాబితాను గురువారం రిక్రూట్‌మెంట్ విభాగానికి పంపారు.

వయసు సడలించే యోచన: హోం మంత్రి

పోలీస్ కానిస్టేబుళ్ల నియామకంలో వయసు సడలించే విషయమై చర్చలు జరిపినట్టు హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. రాష్ట్రంలో ఏ విధంగా అమలు చేస్తున్నారనేది పరిశీలిస్తున్నామన్నారు. కొన్నేళ్లకాలంగా కానిస్టేబుళ్ల నియామక భర్తీ కాలేదని, 2-3ఏళ్ల వయో పరిమితిని సడలించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇదే విషయమై డీజీపీకి సూచించామని, ఇతర రాష్ట్రాలలో ఎంతమేర వయసు సడలించారనేది గమనించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సూచించామన్నారు. డీజీపీ నుంచి నివేదిక వచ్చాక తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

విభాగాల వారీగా కేఎస్ఆర్‌పీలో కేటాయింపులు

విభాగం పేరు	పోస్టులు	జనరల్	స్పోర్ట్స్
బెంగళూరు 1వ బెటాలియన్	134	130	4
బెళగావి 2వ బెటాలియన్	140	136	4
బెంగళూరు 3వ బెటాలియన్	113	110	3
బెంగళూరు 4వ బెటాలియన్	134	130	4
మైసూరు 5వ బెటాలియన్	103	100	3
మంగళూరు 7వ బెటాలియన్	335	325	10
శివమొగ్గ 8వ బెటాలియన్	120	116	4
బెంగళూరు 9వ బెటాలియన్	75	73	2
హాసన్ 11వ బెటాలియన్	135	131	4
తుమకూరు 12వ బెటాలియన్	135	131	4
బెళగావి 2వ బెటాలియన్ మహిళలు	23	22	1
బెంగళూరు 4వ బెటాలియన్ మహిళలు	28	27	1
మైసూరు 5వ బెటాలియన్	25	24	1

కల్యాణ కర్ణాటక పరిధిలో..

బెంగళూరు 1వ బెటాలియన్	33	32	1
బెంగళూరు 3వ బెటాలియన్	34	33	1
బెంగళూరు 4వ బెటాలియన్	33	32	1
కలబురగి 6వ బెటాలియన్	180	175	5
బెంగళూరు 9వ బెటాలియన్	33	32	1
బెంగళూరు 4వ బెటాలియన్ మహిళలు	12	12	-
కలబురగి 6వ బెటాలియన్	41	41	-
ఇండియన్ రిజర్వు బెటాలియన్	166	161	5

ఉపాధ్యాయులకు దసరా సెలవులు లేవు

● కులగణన సర్వే విధులకు నియామకం
● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మరికొన్ని రోజుల్లోనే దసరా సెలవులు వస్తాయని, కుటుంబ సభ్యులతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు లేదా వ్యక్తిగతమైన పనులు పూర్తి చేసుకోవాలని భావిస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో కులగణన సర్వే అమలు చేయాల్సి ఉన్నందున ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఉండవని ప్రకటించింది. ఈనెల 22నుంచి అక్టోబరు 7 వరకు కులగణన సర్వే జరగనుంది. దసరా సెలవులు ఈనెల 20 నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు ఖరారు చేశారు. సర్వేకు 1.50 లక్షలమంది ఉపాధ్యాయులను నియమించాలని నిర్ణయించారు. సర్వేలో పాల్గొనేవారికి ఈనెల 19 వరకు ప్రత్యేక శిక్షణా తరగతులు జరగనున్నాయి. పాఠశాల ముగిశాక ప్రతి రోజూ సాయంత్రం 5 గంటలనుంచి శిక్షణలు కొనసాగనున్నాయి. కొన్ని శాఖలలో సెలవురోజులలోనూ పనిచేస్తే ప్రత్యామ్నాయ వెసలుబాటు ఉంటుంది. విద్యాశాఖలోనూ ప్రత్యామ్నాయ వెసలుబాటు కల్పించాలనే డిమాండ్ ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 46,757 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 1.77 లక్షలమంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో 1.50 లక్షల మందిని సర్వే విధులకు కేటాయించారు.

దసరా ఉత్సవాలకు రాజమాతకు ఆహ్వానం



రాజమాతకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న మంత్రి మహదేవప్ప

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక మైసూరు దసరా ఉత్సవాలలో పాల్గొనాలని రాజమాత ప్రమోదాదేవి ఒడెయార్‌కు అధికారికంగా స్వాగతించారు. ఆదివారం మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప నేతృత్వంలో అధికారులు ప్యాలెస్‌కు వెళ్లారు. దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్న విషయం తెలిసిందే. ఆహ్వానపత్రిక అందచేసి ఉత్సవాలలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మహదేవప్ప మీడియాతో మాట్లాడుతూ దసరా అనేది కేవలం పండుగ కాదని, అది మన సంస్కృతికి ప్రతీక అన్నారు. యదువంశీకులనుంచి ఏటా మద్దతు లభిస్తోందని, ఎప్పుడూ ఇబ్బంది కలగలేదన్నారు. దసరా ఉత్సవాలకు ఉత్తమ సహకారం అందిస్తామని ప్రమోదాదేవి హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఒకటిరెండు సమస్యలు ఉన్నాయని అవి పరిష్కారం అవుతాయని ఓ ప్రశ్నకు దాటవేశారు. జిల్లా అధికారి లక్ష్మీకాంతరెడ్డి, నగర పోలీస్ కమిషనర్ సీమాలాట్కర్, ఎస్పీ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అయితే ఉత్సవాలను రచయిత బానుముస్తాక్ ద్వారా ప్రారంభించదలచడాన్ని యువరాజు వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఆదివారం మావటీలు, వారి కుటుంబీకులకు జిల్లా యంత్రాంగం భోజనవసతి కల్పించారు. వారితో కలసి మంత్రి మహదేవప్ప, జేడీఎస్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ భోజనం చేశారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్‌కుమార్ సింగ్

లేపాక్షి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన లేపాక్షిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని పరిశీలించారు. నాట్యమండపంలో తైలవర్ణాలతో తీర్చిదిద్దిన రామాయణ, మహాభారత చిత్రాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. దుర్గా, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, దేవదాయశాఖ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.



వీరభద్రుడి ఆలయంలో జస్టిస్ దినేష్‌కుమార్ సింగ్



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,631.97
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	13.024	25,060
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,666	21,356
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.66



దెబ్బతిన్న పత్తిపంట

భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు

సిరుగుప్ప, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా భారీ వర్షాలతో జనజీవన పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. పలు పంటలు దెబ్బ తిన్నాయి. ముఖ్యంగా పత్తి పంట పూర్తిగా తింది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. సాయంకాలం కుంభవర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరుసగా ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తుండటంతో రోడ్లన్నీ జలమయంగా మారి రచ్చమయంగా మారాయి. కే బెళగల్, రారావి మార్గంలో వాగులు పొంగి వాహనాల రాకపోకలు అంతరాయం కలిగింది. రారావి, అగసనూరు గ్రామాలలో పత్తి పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



పొంగి పొర్లుతున్న వాగు

పౌష్టికాహారంతో రక్తవృద్ధి

సిరుగుప్ప, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో మహిళల ఆరోగ్యం మెరుగవడంతో పాటు, రక్తవృద్ధి విశేషంగా పెరుగుతుందని ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లోహి పాషా తెలిపారు. ఆదివారం సిరుగుప్ప పట్టణంలో ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి ఆధ్వర్యంలో మహిళలకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్లు మాట్లాడారు. వితంతువు మహిళలకు పింఛన్ పత్రాలను అందజేశారు. వైద్యులు మహమ్మద్ ఖాసీమ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ధర్మస్థల అధికారులు

లోక్ అదాలత్ విజయవంతం

● 11,512 కేసుల పరిష్కారం ● రాజీతో చెక్‌బౌన్స్ కేసులు, దంపతుల గొడవలకు చెక్ : న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బళ్లారి విజయనగరం జిల్లాలతో సహా 31 కోర్టుల్లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ న్యాయాధికారి జే.శాంతి అన్నారు. చాలా కాలంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 16,650 కేసులను రాజీ కోసం గుర్తించామని వాటిలో 11,512 కేసులను విజయవంతంగా పరిష్కరించామన్నారు. రూ 24,19,55,071 పరిహారం అందిందన్నారు. పరిష్కరించబడిన 4.60909 ప్రీ-లిటిగేషన్ కేసుల నుంచి రూ. 193,78,69,679 పరిహార మొత్తాన్ని తిరిగి పొందారన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా బళ్లారి విజయనగరం జిల్లాల్లో మొత్తం 27బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈఅదాలత్ వేలాది కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో కోర్టుకు వెళ్లకుండా నిరోధించే అనేక ప్రీ-లిటిగేషన్ కేసులు ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ, చర్చల ద్వారా పరిష్కరించడం అదాలత్ యొక్క ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రమాద భీమా కేసులు, చెక్కు బౌన్స్, బ్యాంకు రుణ చెల్లింపు కేసులు, వినియోగదారుల ఫిర్యాదులు వంటి వివిధ రకాల కేసులను లోక్ అదాలత్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా పరిష్కరించామని రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకున్న వారికి కోర్టు రుసుము మొత్తాన్ని తిరిగి చెల్లించామన్నారు. జిల్లా 10కుటుంబ కేసుల్లోని వివాదాలు పరిష్కారమై, విడిపోయిన భార్యభర్తలు సామరస్యపూర్వక జీవితాన్ని గడపడానికి రాజీపడ్డారు. పదేళ్లగా పెండింగ్‌లో ఉన్న 04 చెక్ బౌన్స్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. న్యాయపరమైన ఒత్తిడిని తగ్గించడానికి సమాజంలో సామరస్యపూర్వక వాతావరణాన్ని సృష్టించడానికి లోక్ అదాలత్‌లు దోహదపడ్డాయన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు,బ్యాంకు అధికారులు, ప్రభుత్వ అధికారులు, కంపెనీలు సహా అన్ని వాటాదారుల సహకారం వల్లే అదాలత్ విజయవంతం అయ్యిందని న్యాయాధికారి అన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న న్యాయాధికారి శాంతి

ప్రజాస్వామ్యంపై అవగాహన తప్పనిసరి: జడ్పీ సీఈఓ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ శోభారాణి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యువతకు ప్రజాస్వామ్యంపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని జడ్పీ సీఈఓ మహ్మద్ హ్యారీస్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య వేడుకల్లో భాగంగా నగరంలోని పాత జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో 'నాఓటు నాహక్కు' నినాదతో బళ్లారి నుంచి బెంగళూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జడ్పీ సీఈఓ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను, ఓటు హక్కు, ప్రాథమిక విధుల గురించి యువతకు అవగాహన కల్పించడమే ర్యాలీ ఉద్దేశమన్నారు. ఈ నెల 15న జిల్లా కేంద్రంలో జరిగే అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి ముందు నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. నగరంలోని నూతన జిల్లాపరిపాలన భవనం నుంచి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి గడిగ చెన్నప్ప సర్కిల్, కనకదుర్గమ్మ ఆలయం, ఎస్పీ సర్కిల్, గవియప్ప సర్కిల్ మీదుగా ర్యాలీ సాగి జోళదరాశి దొడ్డన గౌడ రంగమందిరం వద్ద ముగుస్తుందన్నారు. అదనపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి పది మంది ద్విచక్ర వాహనదారులను గుర్తించి భద్రత చర్యలతో ర్యాలీని నిర్వహించామని తెలిపారు. ర్యాలీ బళ్లారి నుంచి జాతీయ రహదారి మీదుగా బెంగళూరులోని విధాన సౌధకు బయల్దేరి సోమవారం బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈసందర్భంగా జిల్లాపోలీసు సూపరింటెండెంట్ శోభారాణి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ చిదానందప్ప, జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప, మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణనాయక్, జిల్లాలోని వివిధ సంస్థల ఆఫీసు బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

గజాననుడికి ఘనంగా వీడ్కోలు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్, బజరంగదళ ఆధ్వర్యంలో చిత్రదుర్గ నగరంలోని ప్రతిష్ఠించిన మహాగణపతి నిమజ్జన కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గణేషుడి నిజమ్మన కార్యక్రమానికి ఇసుకేస్తే రాలనంతగా లక్షలాది మంది నిజమ్మన కార్యక్రమానికి విచ్చేసి గజాననుడికి వీడ్కోలు పలికారు. 18 సంవత్సరాలుగా గణేషుడి ఉత్సవాల్లో భాగంగా బిడి రోడ్డుజైన్‌ధామాలో 18 అడుగుల ఎత్తుగల గణేష్‌మూర్తిని ఆగస్టు 27న ప్రతిష్ఠించారు. సుమారు 19 రోజుల పాటు దిననిత్యం నగర ప్రజల నుండి పూజల అందుకున్న వినాయకుడికి సెప్టెంబరు 13వ తేదీన శోభాయాత్రద్వారా మహాగణపతికి నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిమజ్జన సమయంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు డి.జెకు అనుమతి ఇవ్వలేదు. అయితే వీహెచ్‌పీ, బజరంగదళ కార్యకర్తలు శుక్రవారం మధ్యరాత్రి వరకు రాస్తారోకో నిర్వహించి డిజెలకు అనుమతి ఇవ్వాలని పట్టుపడ్డంతో ఆఖరికి కేవలం 6 డీజేలకు అనుమతి ఇచ్చారు. విశ్వ హిందూ పరిషత్ సహ కార్యదర్శి శరణ్‌ను జిల్లా ప్రవేశానికి జిల్లాధికారి నిబంధనలు విధించారు. హైకోర్టు అనుమతి పొంది శోభాయాత్రలో పాల్గొనాల్సి వచ్చింది. నగర ప్రముఖ వీధుల్లో శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన శోభాయాత్ర మధ్యరాత్రి చంద్రవళ్లిని చేరుకుంది. అక్కడ బావిలో గణేషుడి మూర్తికి నిమజ్జనం చేశారు. ఈ శోభాయాత్రలో భద్రత కోసం 3వేల మంది పోలీసు సిబ్బందిని నియమించడం విశేషం.



శోభాయాత్రలో సాగుతున్న మహాగణపతి



భారీగా హాజరైన భక్తులు

హోసూరు జోన్



సీఎంను స్వాగతిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

సీఎం స్టాలిన్‌కు ఘన స్వాగతం

హోసూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పర్యటనలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఘనస్వాగతం లభించింది. ఆదివారం ఉదయం చెన్నై నుంచి విమానంలో సీఎం విచ్చేశారు. హోసూరుకు చేరుకున్న సీఎంను ఎంపీ గోపినాథ్, ఎమ్మెల్యే వై ప్రకాశ్‌లు విమానాశ్రయంలో స్వాగతించారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక పుస్తకాన్ని బహూకరించారు. బర్గూరు ఎమ్మెల్యే మతియజగన్, మేయర్ సత్య, డిప్యూటి మేయర్ ఆనందయ్య, మాజీ ఎంపీ సుగవనం, మాజీ ఎమ్మెల్యే మురుగన్‌లు సీఎంను స్వాగతించారు. హోసూరు, శూలగిరి మీదుగా కారులో కృష్ణగిరికి బయల్దేరారు. డీఎంకే కార్యకర్తలు, నాయకులు, ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి స్వాగతం పలికారు. పెలకొండపల్లి, అందివాడి, మాదిగిరి జంక్షన్, రైల్వే స్టేషన్, ఇన్నర్‌రింగ్‌రోడ్డు, అశోక పిల్లర్, సీతారాం నగర్, పెరండపల్లి, సూలగిరి, గురుపరపల్లి మీదుగా సీఎం కారులో కృష్ణగిరికి చేరుకున్నారు.

ఏటీఎం చోరీ కేసులో నిందితుల అరెస్ట్

హోసూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని ప్రైవేట్ బ్యాంకు ఏటీఎం మిషన్ నుంచి వినూత్నరీతిలో చోరీ చేసిన దుండగులను పోలీసులు అరెస్టు చేశారు. హర్యానాకు చెందిన తాహిర్ (31), హసమ్ (28), లారీ డ్రైవర్ మహ్మద్‌సాద్ (20)ను అరెస్టు చేసి లారీని స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎం మరమ్మతుకు గురికావడంతో శనివారం రిపేరీ చేయడానికి సిబ్బంది వెళ్లారు. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించగా ఇద్దరు యువకులు ఏటీఎం నుంచి చోరీ చేసినట్టు గుర్తించారు. వెంటనే సంబంధిత విభాగం అధికారులకు సమాచారం అందించారు. హోసూరులోని లేక్ స్ట్రీట్‌లోని ఏటీఎం మెయింటెనెన్స్‌ను మురళి అనే వ్యక్తి పర్యవేక్షిస్తున్నారు. ఆ సమయంలో వాట్సప్‌లో వచ్చిన సమాచారం మేరకు ఉత్తరాదికి చెందిన ఇద్దరు నిందితులు లోప ఉన్నారని గుర్తించి వెంటనే షట్టర్ మూసివేసి హోసూరు నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఏటీఎం సెంటర్ లోపల ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరు ఏటీఎంలో డెబిట్ లేదా క్రెడిట్ కార్డును ఇన్‌సెర్ట్ చేశాక సదరు నగదు బయటకు రాకుండా చేసేవారని, నిర్దిష్ట సమయంలో ఆ మొత్తాన్ని వీరు తీసుకునేవారన్నారు. అంచెట్టి, బెలత్తూరు. పెలకొండపల్లి, మాదిగిరి, హోసూరు ప్రాంతాలలో ఏటీఎంలలో చోరీకి పాల్పడినట్టు అంగీకరించారన్నారు. కాగా ఏటీఎంల నుంచి నగదు డ్రా చేసేవేళ ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని సూచించారు.



అరెస్టయిన నిందితులు

కనీస సౌకర్యాలకు తొలి ప్రాధాన్యం: చైర్ పర్సన్

రాయచూరు సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు కనీస సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించేందుకు తాము తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు మహానగర పాలిక చైర్ పర్సన్ నరసమ్మ మాడగిరి అన్నారు. రూ.80 లక్షల వ్యయంతో నగరంలోని హరినవాడలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ తాగునీటి ట్యాంక్ పనులకు ఆదివారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నరసమ్మ మాడగిరి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వార గతంలో నిర్మాణం జరిగి శిథిలావస్థకు చేరిన ట్యాంక్ స్థానలో నూతన ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ట్యాంక్ నిర్మాణం ద్వార హరిజనవాడతో పాటు సమీపంలోని నాల్గైదు కాలనీలకు తాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. కాగా రెండు నెలలలోగా నిర్మాణ పనులు పూర్తి కానున్న నేపథ్యంలో ఆలోగా తాగునీటి సరఫరాకు కొంత అంతరాయం ఉంటుందని ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.



భూమిపూజలో పాల్గొన్న చైర్‌పర్సన్ నరసమ్మ

బీసీ కులగణనపై సందేహాలు వద్దు: ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ కుమార్ నాయక్

రాయచూరు సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభభత్వం చేపడుతున్న బీసీ కులగణనమ సామాజిక ఆర్థిక సర్వేల పై ఎవ్వరికి ఎలాంటి సందేహాలు భయం అక్కర్లేదని రాయచూరు లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్ అన్నారు. జాగృతి కర్ణాటక ఈసీల ఐక్యవేదికల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన జాగృతి సమావేశంలో పాల్గొని ఎంపీ మాట్లాడారు. రాష్ట్ర ప్రత్వం వెనకబడిన వర్గాలన్నిటికి సామాజిక న్యాయం కల్పించే ఉద్దేశంతోనే మరో ప్రయత్నంగా బీసీ కులగణనకు ఆర్థిక సామాజిక సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలకు తావు లేదని కేవలం సమసమాజ స్థాపనే లక్ష్యంగానే సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ వర్గాల ప్రియతన నాయకుడు మాజీ సీఎం దేవరాజ అరసు శత జయంతి ఉలత్సవాలు, బీసీ కమిషన్ తొలి చైర్మన్ లక్ష్మణ జి హావనూరు జయంతిల సందర్భంగా బీసీ కులగణన పై ప్రభుత్వం మరో సారి నిర్ణయం తీసుకుందన్నారు. ఈ విషయంలో ఏ ఇతర వర్గాలకు అన్యాయం చేయాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఎంపీ స్పష్టం చేశారు. సమావేశంలో మాట్లాడిన అజీం ప్రెమ్‌జీ విశ్వ విద్యాలయం అధ్యపకుడు బీసీల ఆర్థిక సామాజిక సర్వే వల్ల వారి అభ్యున్నతికి సంబంధించి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ విషయంలో అపోహలకు తావు లేకుండా సర్వేకు ప్రతియొక్కరు సహకరించాలని సూచించారు.

కన్నడ మాధ్యమ పాఠశాలల మూసివేత తగదు

● సీనియర్ సాహితీవేత్త, నాడోజ అవార్డు గ్రహీత వీరభద్రప్ప

రాయచూరు సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల భాష మోజుతో కన్నడ భాష మాధ్యమాన్ని బోధిస్తున్న పాఠశాలలను మూసివేసే ప్రత్నం జరుగుతుండడం ఆందోళనకరమని సీనియర్ సాహితీవేత్త,నాడోజ అవార్డు గ్రహీత వీరభద్రప్ప అన్నారు. కలసంకుల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రంగమందిరంలో ఉపాధ్యాయ దినాచరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సాహితీవేత్త వీరభద్రప్ప, దేశంలోని అనేక రాష్ట్రాల్లో మాతృభాషకు ప్రోత్సహం లభిస్తుండగా ఇక్కడ మాత్రం కన్నడ మాధ్యమంలో ఉన్న పాఠశాలలకు ప్రభుత్వం నుంచి తోడ్పాటు కరువైందన్నారు. అదే సమయంలో ప్రైవేటు పాఠశాలలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం సర్కారు పాఠశాలల పై నిర్లక్ష్య ధోరణిగా ఉండడం సరి కాదన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి కలాసంకుల సంస్థ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించి జ్ఞాపికలు అందజేశారు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సాహితీవేత్త వీరభద్రప్ప



రక్తదానం చేస్తున్న అటవీ అధికారి

అటవీ సిబ్బంది రక్తదానం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాఅటవీ శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బళ్లారి జిల్లా శాఖ, డీఎంసీఆర్సీ సంయుక్తంగా నిర్వహించిన అటవీ అమరవీరుల దినోత్సవంలో సిబ్బంది రక్తదానం చేశారు. ఆదివారం నగరంలోని రేడియో పార్క్ సమీపంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన బళ్లారి జోన్‌సబ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బసవరాజు మాట్లాడుతూ అడవి సంరక్షణ అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదని ప్రజలు కూడా చేతులు కలపాలన్నారు. అటవీ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈశిబిరంలో అటవీ శాఖ అధికారులు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ బళ్లారి జిల్లా బ్రాంచ్ సెక్రటరీ షకీబ్, ప్రొఫెసర్ వీరేశ్, దేవన్న, రెడ్‌క్రాస్ సభ్యులు, శివసాగర్, మెహబూబ్ భాషా, సమీర్ షేధ్, ఇతర అధికారులు సిబ్బంది వర్గం పాల్గొన్నారు.

థియేటర్ వద్ద అభిమానుల సందడి



సందడి చేస్తున్న కరవే కార్యకర్తలు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలో ఎస్ఎన్ఎల్ వద్ద కర్ణాటక రక్షణ వేదిక రాజ్యాధ్యక్షులు నిద్రదేవి సినిమా రిలీజ్ కావడంతో కర్ణాటక రక్షణ వేదిక రాజ్య సంచాలకుడు అర్థగిరి రామన్న జిల్లా అధ్యక్షుడు ఉలగప్ప, జిల్లా సంచాలకుడు అసొండి సూరి కర్ణాటక రక్షణ వేదిక అభిమానులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు. కర్ణాటక రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు ఉలగప్ప మాట్లాడుతూ కర్ణాటక రక్షణ వేదిక రాజ్య అధ్యక్షులు ప్రవీణ్ శెట్టి మంచి కళారూపం సృష్టించారని వారు అన్నారు. సినిమా ప్రతి మనిషికి సమస్యలు వుంటాయి. నిద్రపట్టడం లేదు నిద్ర అనేది సినిమాలో కొన్ని సన్నివేశాలను ఆకట్టు కుంటాయన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో డ్రీమ్ మోడల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని డ్రీమ్ వరల్డ్ స్కూలు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటారు. యోను ఫైనల్‌లో సెయింట్ పాల్స్ స్కూలు కేరళ బాలికలపై జరిగిన మ్యాచ్‌లో 1.0 గోల్స్ తేడాతో విజయం సాధించి కప్ కైవశం చేసుకున్నారు. ఈ విజయంతో ఈ నెల 22 నుంచి 27 వరకు అందాపూర్ హర్యానాలో జరిగే సీబీఎస్ఈ నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కి ఎంపికయ్యారు. విద్యార్థులను డ్రీమ్ వరల్డ్ స్కూల్ చీఫ్ అనిల్ బాబు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

హుగర్ సమాజం అన్ని రంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): హుగర్ సమాజం అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. ఆదివారం హుగర్ సమాజం సంగాత్రేయ పాఠశాలలో ఏర్పాటు చేసిన బసవాది శివ శరణి హుగర్ మాదయ్య 9వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూల వ్యాపారి అభివృద్ధి సంస్థకు సంబంధించి సీఎంతో చర్చించి నిధులు కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శివశరణి 12వ శతాబ్దం నుంచి ఇప్పటివరకు మాదయ్య అందించిన సహకారం ప్రత్యేకమైనదన్నారు. పూల వ్యాపారి సమాజం కాయకవృత్తితో సౌకర్యవంతమైన జీవితాన్ని నిర్మించుకున్న ఘనత ఆయనదేనన్నారు. రోజువారీ పనిలో కొంతమొత్తాన్ని పిల్లల విద్య కోసం ఉపయోగించాలని, సామాజిక, ఆర్థిక, విద్య అభివృద్ధికి పునాదులు వేసుకోవాలన్నారు. పూలవ్యాపారి సమాజం చేసే ఏ పని అయినా నిజాయితీగా జరుగుతుందన్నారు. అనంతరం హుగర సమాజ నూతన తాలుకా అధ్యక్షుడు రవికి సమాజం తరఫున సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ హుగర సమాజం ఆర్థికంగా, విద్యపరంగా, సామాజికంగా రాజకీయంగా వెనుకబడి వుందని హుగర అభివృద్ధి సంస్థకు ప్రత్యేక ప్రాజెక్టులను ప్రణాళిక చేసి కేటాయించాలని సమాజ అభివృద్ధికి దోహదపడాలన్నారు. హుగర సమాజ సమావేశాలు, వేడుకలు నిర్వహించడానికి స్థలం, భవనంకు గ్రాంట్ ఇవ్వాలని కోరారు. శివలింగం తాత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మున్సిపల్ సభ్యులు సీఆర్ హనుమంత, తాలుకా గౌరవాధ్యక్షులు రమేష్ ఉపాధ్యక్షులు అయ్యప్ప ప్రధాన కార్యదర్శి జీర గాదిలింగ, కార్యదర్శి వీరేష్ కోశాధికారి గణేష్ సలహాదారులు జీర్ మల్లప్ప, జీర్ బాబన్న, మద్దికేరి మల్లికార్జున, మల్లికార్జున, చంద్రశేఖరప్ప, నాయకులు భీమన్న, లోకేష్, షణ్ముఖ పాల్గొన్నారు.

బయటపడ్డ శాసనాలు

కంప్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకాలోని నారిహళ్ల జలాశయం వెనుక భాగం ఆదివారం నీటి ఒడ్డున శ్రీ గండి బసవేశ్వరాలయ ప్రాంగణంలో ఇద్దరు దేవతల ఆరాధనను ప్రస్తావించే అరుదైన మంగనీస్ శాసనం బయటపడింది. ఆలయ పూజారి ఎంఎస్ వీరయ్యస్వామి, చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ తిప్పేరుద్ర, నాగభూషణ, విజయనగర పరిశోధన బృందం సహకారంతో ప్రొఫెసర్ తిప్పేస్వామి, డాక్టర్ గోవింద, డాక్టర్ కృష్ణగౌడ, డాక్టర్ తిమ్మలాపురద నరసింహ, డాక్టర్ వీరాంజనేయ, వీరభద్రగౌడ, రవి తెలియజేశారు.



శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న పురాతత్వ పరిశోధకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

సర్ ఎం విశ్వేశ్వరయ్య (జయంతి)



'భారతరత్న' గ్రహీత సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1860 సెప్టెంబరు 15న కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్ళాపుర జిల్లా ముద్దేన హళ్ళిలో జన్మించారు. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మోక్షగుండం గ్రామానికి చెందినవారు. మైసూరు సంస్థానంలో దివాన్‌గా వ్యవహరించి కన్నడ భాషాభివృద్ధికి పరిషత్‌ను ఏర్పాటు చేశారు. మైసూరు దివాన్‌గా ఆయన సేవలకు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం 'నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్ అనే బిరుదు ఇచ్చింది. కృష్ణ రాజసాగర్ (కేఆర్ ఎస్)డ్యామ్‌కు చీఫ్ ఇంజనీర్‌గా వ్యవహరించారు. హైదరాబాద్ నగరానికి మూసీ నది వరదలనుంచి కాపాడేలా కాలువల నిర్మాణంలోనూ, తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించారు. జలవనరుల పెంపుకోసం దోహదపడ్డారు. ఆయన జయంతిని ఇంజనీర్ల దినోత్సవంగా ఆచరిస్తున్నారు. 101వ యేట 1962 ఏప్రిల్ 12న కన్నుమూశారు.

శరత్‌చంద్ర ఛటర్జీ (జయంతి)



బెంగాలీ నవలా రచయిత శరత్ చంద్ర ఛటోపాధ్యాయ (ఛటర్జీ) 1876 సెప్టెంబరు 15న హుగ్లి జిల్లా దేబానందపూర్‌లో జన్మించారు. 20వ శతాబ్దంలో చిన్నకథల రచయితల్లో తనదైన గుర్తింపు పొందారు. సామాజిక అంశాలతో కూడి ఉంటాయి. ఆయన బెంగాలీలో రచించిన 'దేవదాస్' నవల 16 రకాలుగా రూపొందింది. 50కుపైగా నవలలు పలు భాషలలో సినిమాలుగా రూపొందాయి. 1938 జనవరి 16న కన్నుమూశారు.

అగథ క్రిస్టీ (జయంతి)




డేమ్ అగథ మేరీ క్లారిసా క్రిస్టీ 1890 సెప్టెంబరు 15న యునైటెడ్ కింగ్‌డమ్ దేశంలోని టోర్క్వేలో జన్మించారు. 66 డిటెక్టివ్ నవలలు, 14 చిన్నకథలు రాశారు. 'ది మౌస్ ట్రాప్' అనే నాటిక 1952 నుంచి నిరంతరంగా 2020వరకు లండన్‌లోని వెస్టెఎండ్‌లో ప్రదర్శించబడింది. కొవిడ్ ప్రభావంతో నాటిక ప్రదర్శన చేయలేదు. ఆమె నవలలు 200 కోట్లకు పైగా ప్రతులు అమ్ముడై 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు. మిస్టరీ రైటర్స్ ఆఫ్ అమెరికాచే గ్రాండ్ మాస్టర్ అవార్డును అం దుకున్న తొలి మహిళ. సాహితీసేవలకు డీబీఈలో గుర్తింపు లభించింది. ఆమె నవలలు సినిమా, బుల్లితెర, బీబీసీ రేడియో, వీడియో గేమ్ సిరీస్‌లోను చోటు దక్కించుకున్నాయి. 1976 జనవరి 12న కన్నుమూశారు.

అణ్ణాదురై (జయంతి)




'అణ్ణా'గా పేరొందిన తమిళనాడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాంజీవరం నటరాజన్ అణ్ణాదురై 1909 సెప్టెంబరు 15న జన్మించారు. తమిళ సాహిత్యానికి ఎంతో కృషి చేశారు. డీఎంకే పార్టీ సంస్థాపకులు. దేశంలో కాంగ్రెసేతర పార్టీ అయిన డీఎంకే పూర్తి మెజారిటీ చేపట్టిన తొలి ప్రభుత్వం ఆయనదే కావడం విశేషం. రచయితగాను, నాటకరంగంలోనూ, సినీ రంగంలోనూ తనదైన ప్రతిభను చాటుకున్నారు. అన్ని రంగాలలో స్ఫూర్తిగా నిలిచిన నాయకుడిగా పేరొందారు. 1969 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

బూర్గుల రామకృష్ణారావు (వర్ధంతి)



రామకృష్ణారావు 1899 మార్చి 13న అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా) కల్వకుర్తి సమీపాన పడకల్ గ్రామంలో జన్మించారు. స్వగ్రామమైన బూర్గుల నామంతోనే పేరొందారు. బహుభాషావేత్త, రచయిత, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు. న్యాయ వాదిగా ఉంటూనే రాజకీయాల్లో రాణించారు. నిజాం పాలనకు స్వస్తి పలికిన అనంతరం 1952లో ప్రజా ప్రభుత్వంలో హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. కేరళ రాష్ట్ర తొలి గవర్నర్‌గా, ఉత్తరప్రదేశ్ 4వ గవర్నర్‌గాను రాణించారు. సాహితీవేత్తగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 1967 సెప్టెంబరు 15న కన్నుమూశారు. ఆయన గౌరవార్థం 2000లో పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

డాక్టర్ సుబ్రమణియన్ స్వామి (పుట్టినరోజు)



ప్రముఖ రాజకీయనాయకుడు, ఆర్థికవేత్త డాక్టర్ సుబ్రమణియన్ స్వామి 1939 సెప్టెంబరు 15న చెన్నైలోని మైలాపూర్‌లో జన్మించారు. ఐఐటీ ఢిల్లీలో ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. 2016 నుంచి 2022 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. బీజేపీలో చేరకముందు జనతాపార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా, లేబర్ స్టాండర్డ్స్ అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. విదేశీ వ్యవహారాలు ఇతర అంశాలపై ఎన్నో పుస్తకాలు, జర్నల్స్ రాశారు.

రమ్యకృష్ణ (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖనటి రమ్యకృష్ణ 1970 సెప్టెంబరు 15న చెన్నైలో జన్మించారు. తమిళనాడు ప్రముఖ పాత్రికేయుడు, విమర్శకుడు చో రామస్వామి మేనకోడలు. 1985లో భలేమిత్రులు చిత్రంతో కథానాయికగా తెలుగు సినిమారంగంలోకి అడుగు పెట్టారు. అల్లుడుగారు చిత్రంతో ఆమె దశ మారిపోయింది. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీభాషలలో 260కుపైగా సినిమాలలో నటించారు. మూడు నంది అవార్డులతోపాటు నాలుగు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, ఇతర అవార్డులు అందుకున్నారు. భరతనాట్యం, కూచిపూడిలలో రాణించి నృత్యకారిణిగా పలు స్టేజ్ షోలు ప్రదర్శించారు. సినీ దర్శకుడు కృష్ణవంశీని పెళ్లాడారు. 'బాహుబలి' సినిమాలో శివగామి క్యారెక్టర్‌తో మరింత గుర్తింపు పొందారు.

దివ్యాంగుల పట్ల సమాజ ధోరణి మారాలి

- 'హెగలు' పుస్తకం ఓ మానవీయ కోణం
- ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాళె

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగుల పట్ల సానుభూతి అవసరం లేదని, వారిపట్ల ధోరణి మారాలని, తగిన అవకాశం ఇవ్వాలని, హెగలు అనే పుస్తకం ఓ మానవీయకోణమని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాళె అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో విద్యానిపుణుడిగా పేరొంది దశాబ్దాలకాలంగా అధ్యాపకుడిగా, చాళుక్య యూనివర్సిటీ వ్యవస్థాపక చాన్స్‌లర్‌గా వ్యవహరించిన పద్మశ్రీ ఎంకే శ్రీధర్‌కు 40ఏళ్లపాటు సేవలందించిన నరసింహ ఇతివృత్తంతో భారతిహెగ్డే రచించిన హెగలు పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. యువపథలో జరిగిన కార్యక్రమంలో సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ కులపతి మల్లేపురం జీ వెంకటేశ్, ప్రముఖ దర్శకుడు నాగాభరణ, సంపాదకులు రవీంద్రభట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ హొసబాళె మాట్లాడుతూ సమాజంలో వైకల్యం ఉన్న వారిపట్ల సానుభూతి అవసరం లేదని, వారు ఉన్న అవయవాలతోనే ప్రత్యేక శక్తిని కలిగి ఉంటారన్నారు. ఎంకే శ్రీధర్‌కు కాళ్లు, ఓ చేయి లేకున్నా ఆయన మేధావితనాన్ని ఎవరూ వెలకట్టలేరన్నారు. విద్యానిపుణుడిగా వేలాదిమందికి ఉత్తమ మార్గంలో నడిపారన్నారు. ఆయన వద్ద 40ఏళ్లపాటు నరసింహ సేవలను అంచనా కూడా వేయలేమన్నారు. ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో సాహసాలు సాధనలకు నరసింహ కీలకమన్నారు. వీరిద్దరూ చెన్నైకు ప్రయాణిస్తుండగా రైలు ప్రమాదానికి గురైతే కుర్చీతోపాటు శ్రీధర్‌ను మోసుకుని రైలు దిగి సుదూరం తీసుకెళ్లారన్నారు. మల్లేపురం వెంకటేశ్ మాట్లాడుతూ మానవతా కోణం ఉంటేనే ఇలాంటి రచనలు సాధ్యమన్నారు. మూడోకంటితో చూస్తేనే కొత్తకోణం వస్తుందని అది మానవత్వపు అంతఃకరణ అని అభిప్రాయపడ్డారు. దర్శకుడు నాగాభరణ మాట్లాడుతూ హృదయంలో నుంచి పుట్టిన హృదయవిదారకమైన మానవీయ కోణమే ఈ పుస్తకమన్నారు. ఎంకే శ్రీధర్ ఓ విశ్వవిద్యాలయమైతే నరసింహ ఓ రిజిస్ట్రార్, ప్రస్తుతం ఓ వీసీ అని అభివర్ణించారు. జీవనచరమాంకంలో భుజం ఇచ్చేందుకు నలుగురు కావాలని అభిప్రాయపడతారని, అలా నరసింహ కూడా 40ఏళ్లుగా నిస్వార్థమైన సేవతో ఎంకే శ్రీధర్‌లోని శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఓ మానవత్వంలా పని చేశారన్నారు. రవీంద్రభట్ మాట్లాడుతూ దివ్యాంగుల గురించి ఆలోచన కాదని వారి సాధనలు చూడాలన్నారు. ఈ పుస్తకంలో నా భాగస్వామ్యం మరో సంతోషకరమంటూ అభిప్రాయపడ్డారు. ఎంకే శ్రీధర్ మాట్లాడుతూ ఇదో భావనాత్మకత ఓ పుస్తకం రూపంలో వచ్చిందన్నారు. రచయిత్రి భారతిహెగ్డే మాట్లాడుతూ ఈ పుస్తకం తీసుకురావడమే ఓ సవాల్ అన్నారు. నరసింహ ఇతివృత్తంతో పుస్తకం రాయదలచుకున్నానని, కానీ అతను ఏమీ మాట్లాడరని, 40ఏళ్ల సేవగురించి మాట్లాడితే బాగుందని దాటవేస్తారన్నారు. అయితే నరసింహ భార్య సుధ, కుమారుడు భరత్‌తోపాటు వారి కుటుంబీకులు తెలిపిన అంశాలతోనే రూపకల్పన చేశామన్నారు. దివ్యాంగుల పట్ల సమాజంలో మార్పు రావాలని ఇక్కడ వ్యక్తికంటే చర్య ప్రధానం కావాలని కొనియాడారు. కార్య క్రమంలో మిత్రజ్యోతి ట్రస్టు ముఖ్యులు మధుసింఘాల్, ఎంపీ లెహర్‌సింగ్ సిరోయ్, ఎమ్మెల్సీ రవికుమార్, ఎమ్మెల్యే సురేశ్‌గౌడతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు హిందూపురం నుంచి ఎంకే శ్రీధర్ అభిమానులు హాజరయ్యారు.



పుస్తకావిష్కరణలో ప్రముఖులు

విశ్వవిద్యాలయాల్లో గుణాత్మకతకు బ్రిటన్‌తో ఒప్పందం

- తొలివిడతలో ఆరుగురు వీసీలు లండన్‌కు..

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలలో అకడమిక్, పరిశోధనలలో గుణాత్మకత పెంచేందుకు బ్రిటన్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అక్కడి యూనివర్సిటీల పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు తొలి విడతలో 6 యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్‌లను లండన్‌కు పంపదలిచారు. రాష్ట్రంలో పలు విశ్వవిద్యాయాలలో గుణాత్మకత తగ్గడం, కొన్ని కోర్సులకు డిమాండ్ లేకపోవడం, శతాబ్దాల నాటి కొన్ని యూనివర్సిటీలు మూతపడే పరిస్థితికి రావడంతో రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. బ్రిటన్‌లో కేంబ్రిడ్జ్, వేల్స్, ఓల్వార్ హ్యాంప్టన్‌తోపాటు పలు విశ్వవిద్యాలయాలు సాయం చేసేందుకు సిద్ధమయ్యాయి. బ్రిటన్‌లో పర్యటిస్తున్న ఉన్నతవిద్యాశాఖ మంత్రి సుధాకర్ వివిధ యూనివర్సిటీల చాన్స్‌లర్‌తో చర్చలు జరిపినట్టు ఉన్నత విద్యాశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. తొలివిడతలో బెంగళూరు యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్ఎం జైకర్ నేతృత్వంలో వీసీలు వెళ్లనున్నట్టు తెలిపారు. రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం కులపతి డాక్టర్ బీసీ భగవాన్, ఉన్నతవిద్యా పరిషత్ ఈడీ కేజే చంద్రశేఖర్, బ్రిటన్‌లోని పలు యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకున్నట్టు ప్రకటించారు.



ఒప్పందపత్రాలతో వివిధ యూనివర్సిటీల వీసీలు

హొసపాళ్యలో గణేశ ఉత్సవం



హొసపాళ్య ఉత్సవంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి



చిక్కబేగూరులో పాల్గొన్న స్థానిక ప్రముఖులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని హొసపాళ్య, చిక్కబేగూరులలో వినాయకుడిని కొలువుదీర్చారు. వినాయక చవితి ఉత్సవాలు వాడవాడలా కొనసాగుతున్నాయి. చిక్కబేగూరులో ఆదివారం గణనాథుడిని ప్రతిష్ఠించారు. కాంగ్రెస్ నాయకుడు మంజునాథ్ మాట్లాడుతూ ఐదురోజులపాటు ఉత్సవాలు ఉంటాయన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు నాగభూషణం రెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. వందలాదిమందికి అన్నదానం నిర్వహించారు. కాగా హొసపాళ్యలో మూడు రోజులపాటు ఉత్సవాలు ఉంటాయని గణేశ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పూజలలో నియోజకవర్గ ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సనాతనధర్మంపై అవగాహన పెరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజలలో ఐకమత్యం పెంపొందించేందుకు గణేశ ఉత్సవాలు, పండుగలు దోహదపడతాయన్నారు.

కులగణన సర్వేపై శిక్షణ

చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం తలపెట్టిన కులగణన సర్వేకోసం జిల్లా పంచాయతీ కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారులకు ప్రత్యేక ట్రైనింగ్ ఇచ్చారు. ఇందుకుగాను రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్‌లు పాల్గొని అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమాన్ని అదనపు జిల్లా అధికారి డాక్టర్ ఎన్ భాస్కర్ ప్రారంభించారు. బీసీ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఈనెల 22నుంచి అక్టోబరు 7 వరకు ప్రజల సామాజిక, విద్యా సమీక్ష జరగనుంది. సర్వేలో ప్రజలతో ఎలా వ్యవహరించాలి, ప్రశ్నలు ఎలా అడగాలి, సర్వేకు ఉపయోగించే యాప్ పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్‌లు, జిల్లా ఉపాధి అధికారి ఎం ప్రసాద్, గౌరిబిదనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ శంకర్ రెడ్డి, బాగేపల్లి ప్రభుత్వ పీయూ కళాశాల లెక్చరర్ నంజారెడ్డి, చింతామణి తాలూకా బట్లహళ్ళి ప్రభుత్వ పీయూ కళాశాల లెక్చరర్ డాక్టర్ మునిరెడ్డిలు పాల్గొని అవగాహన కల్పించారు. ట్రైనింగ్‌లో 50మంది పాల్గొన్నారు. తాలూకాస్థాయిలో సూపర్‌వైజర్‌లు, ఎన్యుమరేటర్‌లకు రెండు విడతలలో తర్ఫీదు ఇవ్వనున్నారు. ట్రైనింగ్‌లో సబ్‌డివిజనల్ అధికారి అశ్విన్, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి మునిరత్నమ్మ. ఇతరఅధికారులు పాల్గొన్నారు.



శిక్షణలో డాక్టర్ ఎన్ భాస్కర్ తదితరులు

యంత్రాలతో నాట్లు - మహిళలతోనూ సాధ్యమే...

- రుజువు చేసిన మండ్య జిల్లా పంచాయతీ సీఈఓ

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పవర్ టిల్లర్‌లాంటి పరికరంతో వరిపైర్లు మహిళలు కూడా నాటవచ్చునని మండ్య జిల్లా పంచాయతీ సీఈఓ నందిని కేఆర్ నిరూపించారు. రెండురోజులక్రితం జిల్లా పంచాయతీ, మండ్య వ్యవసాయశాఖలు సంయుక్తంగా హొళలు గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన శిబిరంలో సీఈఓ నందిని పాల్గొన్నారు. స్వయంగా పైర్లు నాటారు. యంత్రంతో మహిళలు కూడా సులభతరంగానే పైర్లు నాటవచ్చునని సీఈఓ నిరూపించారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ నాట్లు, కలుపుతీయడం కోతలకు కూలీలు లభించని సమయంలో రైతులు యాంత్రీకరణవైపు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయపనులకు స్త్రీ పురుషులు అనేది ప్రత్యేకం లేదని, ఎవరైనా చేయవచ్చునన్నారు.



పవర్ టిల్లర్‌తో నాట్లు వేస్తున్న జడ్పీ సీఈఓ నందిని

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

శిడ్లఘట్ట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఎస్ దేవగానహళ్ళి గ్రామంలోని పాల ఉత్పత్తిదారుల సహకారసంఘానికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు ఆంజినప్ప పుట్టు మద్దతుదారులు గెలుపొందారు. అధ్యక్షులుగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనరసమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఘనంగా సత్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన సభ్యులు, డైరెక్టర్లకు, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



సభ్యులతో నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు

రోటరీ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిబిరం



రోటరీ డైరెక్టర్ గణేశ్ బాలకృష్ణన్‌ను స్వాగతిస్తున్న నిర్వాహకులు

విజయపుర, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం అంకతట్టి విద్యాద్రి పీయూ కళాశాలలో విజయపుర రోటరీ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిబిరం నిర్వహించారు. రోటరీ జిల్లా 3192 ఒకేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ రొటేరియన్ గణేశ్ బాలకృష్ణన్ మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, స్ఫూర్తి పెంచడమే లక్ష్యంగా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం అందుకోవాలంటే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడం, నైతిక విలువలు, ఉత్తమ నడవడిక, సమయ నిర్వహణ, ఓర్పు వంటివాటిపై అవగాహన కల్పించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి నిరంతరం శ్రమించాల్సి ఉందన్నారు. రోటరీ ద్వారా తమవంతు సమాజసేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 150మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. రోటరీకి చెందిన సిద్దరాజు, అశోక్‌కుమార్, కిరణ్, రుద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



పురస్కారం అందజేస్తున్న జస్టిస్ శ్రీశానంద

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సర్ ఎం విశ్వేశ్వరయ్య సహకారబ్యాంకు ఆధ్వర్యంలో ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీశానంద పలువురు విద్యార్థులకు పురస్కారాలు అందచేశారు. ఇంజనీరింగ్‌లో 8.12 సీజీపీఏ సాధించిన వైష్ణవి, బెంగళూరు యూనివర్సిటీలో బీకామ్‌లో 86శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రమోదిని, మండ్య యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫిజిక్స్‌లో 83శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రగతితోపాటు పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు.

లోక్ అదాలత్‌లో 6,575 కేసుల పరిష్కారం

చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో వేలాది కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లావ్యాప్తంగా వివిధస్థాయి కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యాయి. 9,531 కేసులకుగాను 6,575 కేసులు అదాలత్‌కు ఎంపిక కావడంతో కక్షిదారులు పాల్గొని రాజీ చేసుకున్నారని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి నెరలె వీరభద్రయ్య భవాని తెలిపారు. నెగోషియబుల్, ప్రీ-లిటిగేషన్ కేసులను లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారమయ్యాయన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్, లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ శిల్ప, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిలాష్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మూడురోజులు కావేరి నీరు బంద్

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు వ్యాప్తంగా మూడు రోజులపాటు కావేరి నీరు సరఫరా ఉండదని జలమండలి అధికారులు ప్రకటించారు. అత్యవసర మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉన్నందున సోమవారం నుంచి బుధవారం వరకు కావేరి నీరు సరఫరా ఉండదని ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ స్టేజ్‌లలో మరమ్మతులు, లీకేజ్ నియంత్రణ చర్యల కోసం నీటి సరఫరా ఉండదన్నారు. కావేరి ఐదో విడత పరిధిలో మూడు రోజులపాటు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున 60 గంటలపాటు నీరు సరఫరా కాదన్నారు. ఇందులో భాగంగా కావేరి 1, 2, 3, 4 స్టేజ్‌లలో 16వ తేదీ ఉదయం 6 నుంచి 24గంటలపాటు నీటి సరఫరా ఉండదన్నారు. కావేరి నీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడం కూడా సాధ్యం కాదని ప్రకటించారు.

రోడ్ల దుస్థితిపై విద్యార్థినుల వీడియో వైరల్

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో రోడ్ల దుస్థితి, ఫుట్‌పాత్‌ల అస్తవ్యస్థంపై విద్యార్థినులు చేసిన వీడియో వైరల్ అయ్యింది. అయ్యో బెంగళూరు రోడ్లు... ట్రాఫిక్‌జామ్ అంటే భయమేస్తోంది... అని రోడ్లపై ఏర్పడిన గుంతలను చూపారు. సదరు వీడియోను బీజేపీ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ... డీసీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీలు చెప్పిన బ్రాండ్ బెంగళూరు ఇదేనా అంటూ ప్రశ్నించింది.

17న విశ్వకర్మ పురస్కారాల ప్రదానం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ పండుగల ఆచరణ సమితి, తాలూకా విశ్వకర్మ సముదాయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న తాలూకా కార్యాలయంలో విశ్వకర్మజయంతి, ప్రతిభా పురస్కారాల ప్రదానం నిర్వహిస్తున్నట్టు తాలూకా విశ్వకర్మ సంఘం ప్రముఖులు సుందరాచారి తెలిపారు. పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ తాలూకా పరిధిలో విశ్వకర్మ సామాజికవర్గానికి చెందిన ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, డిగ్రీలలో 75శాతం ఎక్కువ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఇదే సందర్భంగా కులవృత్తిలో రాణించిన ఐదుగురు సీనియర్లకు సన్మానించేలా తీర్మానించామన్నారు. ఎమ్మెల్యే రవికుమార్, తహసీల్దార్ గగనసింధు సహా తాలూకా యంత్రాంగం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రతిభా పురస్కారాలకోసం అర్హులైన విద్యార్థులు 97312 70250కు సంప్రదించాలన్నారు. మీడియా సమావేశంలో విశ్వకర్మ క్షేమాభివృద్ధి సంఘం తాలూకా అధ్యక్షుడు అమర నారాయణాచారి, కాళికాంబ కమఠేశ్వర దేవాలయ సమితి అధ్యక్షుడు మునిరత్నాచారి, సుందరాచారి, శ్రీనాథ్, మంజునాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరి మృతి

ముళబాగిలు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరు బైక్ చోదకులు ఘటనా స్థలంలో మృత్యువాత చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. తాలూకాలోని దొడ్డతమ్మనహళ్ళి గేట్ వద్ద బాలు (22), మిట్టహళ్ళికి చెందిన మల్లేశ్ (32)లు బైక్‌లపై వస్తూ ఎదురెదురుగా ఢీ కొన్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ముళబాగిలు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ప్రమాదంతో ఇరు కుటుంబాలలో విషాదం నెలకొంది.

నీటి కుంటలో పడి విద్యార్థి మృతి

- ఆటలాడుకుంటుండగా ప్రమాదం



రంజిత్ (ఫైల్)

చింతామణి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటలాడేందుకు వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తు కాలుజారి నీటి కుంటలో పడి మృతి చెందాడు. చింతామణి తాలూకా మురగమల్లా హోబళి నందిగానహళ్ళికి అనుబంధంగా ఉన్న జోగ్యానహళ్ళి కుంట సమీపాన ఆటలాడుకుంటూ కాలు జారిపడ్డాడు. మురగమల్లా ప్రభుత్వ పాఠశాలలో రంజిత్ (14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం నలుగురు ఆటలాడుకుంటున్నవేళ రంజిత్ ప్రమాదవశాత్తు కాలు జారిపడ్డాడు. దీంతో మిగిలినవారు గాభరాతో పరుగులు తీయగా సమీపంలో ఉన్న మంజునాథరెడ్డి ప్రశ్నించాడు. రంజిత్ కాలు జారిపడ్డాడని వివరించారు. వెంటనే ఇతరులతో కలసి మంజునాథరెడ్డి అక్కడికి వెళ్లి రక్షించే ప్రయత్నం చేసి గట్టుకు తెచ్చారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని చింతామణి ప్రభుత్వ ఆసు పత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. రంజిత్ తండ్రి రవి ఫిర్యాదు మేరకు కెంచార్లహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసు కున్నారు. సమాచారం అందుకున్న బీఈఓ ఉమాదేవి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు అశోక్కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు సాంత్వన పలికారు.